

రాయలసీమ దరువు

APTEL/26/A7874

www.rayalaseemadaruvu.com

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

నూతనంగా వెలువడుతున్న 'రాయలసీమ దరువు' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. చట్టాలపై అవగాహన ఉండి రాజకీయ విశ్లేషణ, సమస్యల పట్ల అవగాహన, వినూత్న శైలిలో వార్లఉ రాయగలిగే వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

94940 390303
85010 70080

ప్రచురణ : శ్రీ సత్యసాయి/అనంతపురం ఎడిటర్ : ఎనుముల కుల్లాయప్ప శుక్రవారం 09 - అక్టోబర్ - 2026 సంపుటి : 01 సంచిక : 19 పేజీలు : 04, వెల రూ.2

కొత్త కెప్టెన్ స్మృతి మంధాన చేతిలో


జట్టు భద్రంగా ఉంది : హర్మన్‌ప్రీత్

- దశాబ్దానికి పైగా కొనసాగిన కెప్టెన్సీ ప్రస్థానానికి వీడ్కోలు పలికిన భారత మాజీ సారథి
- ఆటను ఆస్వాదిస్తూ, వ్యక్తిగత ప్రదర్శనపై దృష్టి పెట్టేందుకే ఈ నిర్ణయమని వెల్లడి
- స్మృతికి పూర్తి మద్దతుగా నిలుస్తానని, తమ మధ్య మంచి అవగాహన ఉందని స్పష్టీకరణ
- కెప్టెన్సీ ముగిసినా, దేశం కోసం మరిన్ని ట్రోఫీలు గెలవాలన్న ఆకలి తీరలేదన్న హర్మన్‌ప్రీత్ కౌర్



వివరాలు 2లో

వైఎస్ భారతిని ఉద్దేశించి విజయసాయి రెడ్డి పరోక్ష వ్యాఖ్యలు




వివరాలు 2లో

కొందరికి తీర్థం ఇస్తే.. వేళ్ల సందుల నుంచి వదిలేస్తారన్న విజయసాయి

వైసీపీ హయాంలో తిరుమల లడ్డూలో అక్రమాలు నిజమేనని వెల్లడి

ఏపీలో తమ పార్టీ మూడో ప్రధాన శక్తిగా ఎదుగుతుందని ధీమా

శ్రీవారిని దర్శించుకున్న తమన్నా



- కుటుంబ సభ్యులతో కలిసి సుప్రభాత సేవలో పాల్గొన్న తమన్నా
- ఈ దర్శనం ఎంతో తృప్తిగా, ప్రత్యేకంగా అనిపించిందని వ్యాఖ్య
- ప్రస్తుతం హిందీ, తమిళ చిత్రాలపై దృష్టి పెట్టిన తమన్నా

వివరాలు 2లో

కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో

సీఎం చంద్రబాబు భేటీ



ఢిల్లీ, అక్టోబర్ 08 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలకమైన పెండింగ్ అంశాలపై ఈ భేటీలో చర్చించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు, రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన విషయాలపై కేంద్రం దృష్టి సారించాలని కోరుతున్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా గోదావరి–కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టుపై చర్చ జరిగినట్లు తెలిసింది. ఇటీవల జరిగిన దక్షిణాది రాష్ట్రాల జోనల్ కౌన్సిల్ సమావేశంలో ఈ అంశం ప్రస్తావనకు వచ్చిన విషయాన్ని చంద్రబాబు గుర్తుచేశారు. ఈ బృహత్తర ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని అమిత్ షాను ఆయన విజ్ఞప్తి చేశారు. జోనల్ కౌన్సిల్ సమావేశంలో చర్చించిన ఇతర అంశాల పురోగతిపై కూడా ఈ సందర్భంగా సమీక్ష జరిపినట్లు సమాచారం. రాష్ట్ర విభజన హామీలతోపాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన పెండింగ్ అంశాలను పరిష్కరించడంలో కేంద్రం సహకరించాలని చంద్రబాబు కోరినట్లు తెలుస్తోంది.

'బిల్డ్ ఏపీ' తమ నినాదం : సీఎం చంద్రబాబు



- దేశ ప్రగతిలో ఏపీ కీలకమన్న పీయూష్ గోయల్
- 'బిల్డ్ ఏపీ' నినాదంతో ముందుకు వెళుతున్నామని స్పష్టం చేసిన సీఎం చంద్రబాబు
- ఢిల్లీలో సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొన్న సీఎం, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్
- ఒప్పందాలను వాస్తవ పెట్టుబడులుగా మార్చడమే లక్ష్యమన్న ముఖ్యమంత్రి
- ఏపీ అభివృద్ధికి కేంద్రం సంపూర్ణ మద్దతు ఇస్తుందని హామీ ఇచ్చిన పీయూష్ గోయల్
- గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి భారీ సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయని వెల్లడి

ఢిల్లీ, అక్టోబర్ 08 : 'బిల్డ్ ఏపీ' నినాదంతో ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనలో దేశంలోనే అగ్రగామి గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఢిల్లీ వేదికగా జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) భాగస్వామ్య సదస్సు–2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, భవిష్యత్ కార్యాచరణను పారిశ్రామికవేత్తలకు వివరించారు. గత 28 నెలల్లో రాష్ట్రానికి రూ.22లక్షల కోట్ల పెట్టుబడులను సాధించగలిగామని చంద్రబాబు తెలిపారు. కేవలం అవగాహన ఒప్పందాల (ఎంవోయూ)కే పరిమితం కాకుండా, వాటిని వాస్తవ పెట్టుబడులుగా మార్చేందుకు పటిష్ఠమైన కార్యాచరణతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. గూగుల్ 1 గిగావాట్ డేటా సెంటర్, ఆర్సెలార్ మిట్టల్ వంటి దిగ్గజ సంస్థలు ఏపీలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు ముందుకు వస్తున్నాయని వెల్లడించారు. పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న ఎస్క్రో ఖాతాను నవంబరు 12, 13 తేదీల్లో ప్రారంభిస్తామని ప్రకటించారు. పెట్టుబడులకు అవరోధంగా ఉన్న నాలా చట్టాన్ని రద్దు చేశామని, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పరిశ్రమలకు అన్ని అనుమతులు వేగంగా అందిస్తున్నామని తెలిపారు.

వివిధ రంగాల్లో అభివృద్ధి ప్రణాళికలు

నదుల అనుసంధానం ద్వారా ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నీటి కొరత తీర్చవచ్చని చంద్రబాబు పేర్కొన్నారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా, రాష్ట్రాన్ని సౌత్‌ఈస్ట్ ఏషియాకు గేట్‌వేగా మార్చడమే ధ్యేయమన్నారు. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యంలో భాగంగా ఇప్పటికే 110 గిగావాట్లకు ఒప్పందాలు కుదిరాయని, ప్రత్యేక ట్రాన్స్‌మిషన్ కారిడార్ ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. దుగరాజపట్నం, మచిలీపట్నంలో షిప్ బిల్డింగ్ కేంద్రాలు, తిరుపతి, కొప్పర్తిలలో ఎలక్ట్రానిక్స్, డ్రోన్ క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పాలనలో ఏఐ సాంకేతికతను వినియోగిస్తున్నామని, అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ కార్యకలాపాలు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో

-మిగతా 3లో

మొబైల్ ఫోన్ ఇప్పుడు సుపరిపాలనకు సాధనం



- దేశంలోని ప్రతీ జిల్లాకు 5జీ సేవలు విస్తరించాయన్న మోదీ
- మొబైల్ ఇంటర్నెట్ వేగం 2022తో పోలిస్తే 10 రెట్లు పెరిగిందని వెల్లడి
- డిజిటల్ ఇండియా ద్వారా సాంకేతిక అంతరాలను తగ్గించామన్న ప్రధాని
- కోవిడ్ సమయంలో డిజిటల్ వ్యవస్థ దేశాన్ని నడిపించిందని వ్యాఖ్య

ఢిల్లీ, అక్టోబర్ 08 : భారత టెలికాం రంగం కేవలం నెట్ వర్క్‌లు, స్పెక్ట్రమ్, ఇంటర్నెట్ వేగానికే పరిమితం కాలేదని, సుపరిపాలన, ప్రభుత్వ సేవలను ప్రజ లకు అందించడంలో మొబైల్ కనెక్టివిటీ ఒక కీలక శక్తిగా ఆవిర్భవించిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు. నేడు ఢిల్లీలో ప్రారంభమైన 10వ 'ఇండియా మొబైల్ కాంగ్రెస్' (ఐఎంసీ) 2026 సదస్సును ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. గత దశాబ్ద కాలంలో మొబైల్ ఫోన్లు సాధారణ కమ్యూ నికేషన్ పరికరాల స్థాయి నుంచి సుపరిపాలనను అందించే ముఖ్యమైన సాధనాలుగా రూపాం తరం చెందాయన్నారు. 'మొబైల్ ఫోన్ ఇప్పుడు సుపరిపాలనకు ఒక సాధనంగా మారింది' అని ఆయన పేర్కొన్నారు. భారత టెలికాం ప్రస్థానం లో ఇండియా మొబైల్ కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందని ప్రధాని గుర్తుచేశారు. '2022లో ఇదే వేదికపై దేశంలో 5జీ సేవలను ప్రారంభిం చాం. 2023 నాటికి 5జీని దేశవ్యాప్తంగా విస్త రింపజేయడంలో ముందడుగు వేశాం. ఈరోజు దేశంలోని ప్రతి జిల్లాకు 5జీ కనెక్టివిటీ చేరింది. ప్రస్తుతం దేశంలో 5.5 లక్షలకు పైగా

-మిగతా 3లో

స్థానిక ఎన్నికల్లో వైసీపీని అడ్డుకునేందుకు

కుట్ర జరుగుతోంది

- మాజీ మంత్రి, గుంటూరు జిల్లా అధ్యక్షులు అంబటి
- వైసీపీ అభ్యర్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా అధికారులపై ఒత్తిడి చేస్తున్నారన్న అంబటి
- సీఎం, మంత్రి లోకేశ్ ఆదేశాలతోనే ఇదంతా జరుగుతోందని ఆరోపణ
- నామినేషన్లు తిరస్కరిస్తే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరిక



వివరాలు 3లో

రూ. 80 కోట్ల ఆస్తులు ఉన్నా.. సాధారణ జీవితం గడిపిన

నానా పటేకర్



2లో..

ప్రముఖ నటుడు నానా పటేకర్ గుండె పోటుతో కన్నుమూత

గోవాలోని నివాసంలో అస్వస్థత.. ఆసుపత్రిలో మృతి

వేలాది రైతుల కుటుంబాలకు అండగా నిలిచిన నానా పటేకర్

వ్యక్తులు కాదు..

వ్యవస్థే ముఖ్యం

- ఐ-టీడీపీకి నారా లోకేశ్ దిశానిర్దేశం
- ఐ-టీడీపీ విభాగంపై నారా లోకేశ్ సమీక్షా సమావేశం
- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన
- వైసీపీ దుష్ప్రచారాన్ని దీటుగా తిప్పికొట్టాలని పిలుపు
- ఐ-టీడీపీ కమిటీలను త్వరగా నియమించాలని ఆదేశం



2లో..


కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసిన చంద్రబాబు

- పోలవరం, జలధారపై కీలక చర్చ
- ఢిల్లీ పర్యటనలో బిజీగా గడుపుతున్న చంద్రబాబు
- కీలక ప్రాజెక్టుల పురోగతిని సీఆర్ పాటిల్‌కు వివరించిన చంద్రబాబు
- అమరజీవి జలధారకు నిధులు ఇవ్వాలని విన్నపం

ఢిల్లీ, అక్టోబర్ 08 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కాసేపటి క్రితం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని కీలక జల ప్రాజెక్టుల పురోగతిని, నిధుల అవసరాన్ని ఈ సందర్భంగా ఆయనకు వివరించారు. ముఖ్యంగా పోలవరం, జల్ జీవన్ మిషన్‌కు సంబంధించిన అంశాలపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో రూ.30,000 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన 'జల్ జీవన్ మిషన్ – అమరజీవి జలధార' పథకం వివరాలను చంద్రబాబు కేంద్ర మంత్రికి తెలిపారు. రాష్ట్రంలోని 95 లక్షల గ్రామీణ కుటుంబాలకు గాను ఇప్పటికే 62 లక్షల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఉన్నాయని, ఈ కొత్త పథకం ద్వారా మరో 27 లక్షల కుటుంబాలకు నీటి కనెక్షన్లు అందించడమే లక్ష్యమని వివరించారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు నిధులను సకాలంలో విడుదల చేయాలని కోరారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు పురోగతిపై కూడా ఇరువురు నేతలు సమీక్షించారు. వచ్చే గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేయాలనే లక్ష్యంతో పనులు వేగంగా సాగుతున్నాయని చంద్రబాబు తెలిపారు. ప్రాజెక్టుకు నిధుల కొరత లేకుండా కేంద్రం పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు, దక్షిణాది రాష్ట్రాల్లోని ఐదు నదుల అనుసంధానం అంశంపై కూడా చర్చించినట్లు సమాచారం. రెండు రోజుల పర్యటన నిమిత్తం చంద్రబాబు ప్రస్తుతం ఢిల్లీలో ఉన్నారు.



వైఎస్ భారతిని ఉద్దేశించి విజయసాయి రెడ్డి పరోక్ష వ్యాఖ్యలు



- కొందరికి తీర్థం ఇస్తే.. వేళ్ల సందుల నుంచి వదిలేస్తారన్న విజయసాయి
- వైసీపీ హయాంలో తిరుమల లడ్డూలో అక్రమాలు నిజమేనని వెల్లడి
- ఏపీలో తమ పార్టీ మూడో ప్రధాన శక్తిగా ఎదుగుతుందని ధీమా

తిరుపతి, అక్టోబర్ 08 :

వైసీపీ అధినేత జగన్ భార్య వైఎస్ భారతిని ఉద్దేశించి మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి పరోక్షంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. కొందరు ఆలయాలకు వెళ్లినప్పుడు అర్చకులు తీర్థం ఇస్తే, తాగినట్లు నటిస్తూ వేళ్ల సందుల్లోంచి కిందకు వదిలేస్తారని, ఇదే వారు పాటించే సెక్యులరిజం అని ఆయన విమర్శించారు. తిరుపతిలో మీడియాతో మాట్లాడిన ఆయన, తాను స్వచ్ఛమైన హిందువునని, ఇతర మతాల ప్రార్థనా స్థలాలకు కూడా వెళ్తానని అన్నారు. ఈ సందర్భంగా ఏపీలో కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు విజయసాయి రెడ్డి ప్రకటించారు. కులాలు, మతాలకు అతీతంగా ప్రజలందరినీ ఏకం చేసేలా తమ పార్టీ ఉంటుందని తెలిపారు. అధికార టీడీపీ కూటమి, ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ తర్వాత తమ పార్టీ మూడో ప్రధాన శక్తిగా ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై నిలబడుతూ, ప్రభుత్వం, ప్రతిపక్షంపై నిర్మాణాత్మక విమర్శలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. తిరుమల లడ్డూ ప్రసాదం వివాదంపై కూడా సాయిరెడ్డి స్పందించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో లడ్డూ తయారీలో అక్రమాలు జరిగాయని అంగీకరించారు. అయితే, ప్రసాదంలో జంతు కొవ్వు ఉందన్న ఆరోపణలను ఆయన గట్టిగా ఖండించారు. తాము కిలో నెయ్యిని రూ. 320-400 మధ్య కొంటే, ప్రస్తుత ప్రభుత్వం రూ. 658కి కొంటోందని, బహిరంగ మార్కెట్‌లో స్వచ్ఛమైన నెయ్యి ధర రూ.1,000 పైనే ఉందని పేర్కొంటూ నెయ్యి నాణ్యతను ప్రశ్నించారు. కడప జిల్లాలోని కొన్ని ఆలయాల్లోకి ఇప్పటికీ దళితులను అనుమతించడం లేదని ఆరోపించిన ఆయన.. తమ పార్టీ అధికారంలోకి వస్తే అలాంటి వివక్ష చూపేవారికి కఠిన శిక్షలు, జైలు శిక్ష తప్పవని హెచ్చరించారు.

సీఎం అయ్యాక నన్ను స్టింగ్ ఆపరేషన్‌తో ఇరికించే ప్రయత్నం

- డీకే శివకుమార్ సంచలన ఆరోపణలు
- తన వద్ద ఫొటోలు, పత్రాలు ఉన్నాయని వెల్లడి
- పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు ప్రకటన
- స్టింగ్ వెనుక ఉన్నవారు ఎవరో తెలుసన్న సీఎం
- అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- తనతో పాటు మరికొందరిపై స్టింగ్స్ జరుగుతున్నాయని ఆరోపణ

కర్ణాటక, అక్టోబర్ 08 :

కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సంచలన ఆరోపణలు చేశారు. తాను సీఎం అయిన తర్వాత తనను స్టింగ్ ఆపరేషన్‌లో ఇరికించేందుకు ప్రయత్నం జరిగిందని చెప్పారు. దీనికి సంబంధించిన ఫొటోలు, పత్రాలు తన వద్ద ఉన్నాయని తెలిపారు. ఈ వ్యవహారం వెనుక ఎవరున్నారో తనకు తెలుసని అన్నారు. ఢిల్లీలో గురువారం మీడియాతో మాట్లాడిన శివకుమార్.. ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత కొందరు వ్యక్తులు తనను కలిశారని చెప్పారు. వారెవరో, ఎవరి కోసం వచ్చారో తనకు తెలుసన్నారు. "నన్ను ఇరికించేందుకు ప్రయత్నం చేశారు. నా వద్ద ఫొటోలు ఉన్నాయి. ఈ స్టింగ్ ఆపరేషన్ల వెనుక ఉన్న వ్యక్తి ఎవరో నాకు తెలుసు" అని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పోలీసులకు కూడా సమాచారం ఇచ్చినట్లు శివకుమార్ వెల్లడించారు. తనను కలిసిన వ్యక్తులకు సంబంధించిన పత్రాలను భద్రపరిచినట్లు చెప్పారు. అయితే ఈ అంశానికి సంబంధించిన పూర్తి వివరాలను ఇప్పుడు బయటపెట్టలేనన్నారు. 'వాళ్లు ఏం మాట్లాడేందుకు వచ్చారు? ఎలా వచ్చారు? ఎవరిని కలిశారు? అన్నీ నాకు తెలుసు. దీని వెనుక ఎవరు ఉన్నారో కూడా తెలుసు' అని శివకుమార్ అన్నారు. ప్రభుత్వ అధికారులను కూడా ఇలాంటి ఉచ్చుల్లోకి లాగవచ్చని హెచ్చరించిన ఆయన.. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు తెలిపారు. తన చుట్టూ మూడు స్థాయుల్లో వ్యక్తులు ఉంటారని, కొందరిని ప్రత్యేకంగా నియమించినట్లు తనకు సమాచారం ఉందని ఆరోపించారు. తనపైనే కాకుండా మరికొందరిపైనా స్టింగ్ ఆపరేషన్లు జరుగుతున్నాయని శివకుమార్ ఆరోపించారు. వాటి వెనుక ఎవరు ఉన్నారు? వాటికి నిధులు ఎవరు సమకూరుస్తున్నారు? అన్న సమాచారం తన వద్ద ఉందని చెప్పారు. తన ఆరోపణలకు ఆధారాలు ఉన్నాయని స్పష్టం చేశారు. కాంగ్రెస్ మంత్రులను లక్ష్యంగా చేసుకుని స్టింగ్ ఆపరేషన్లు జరిగే అవకాశం ఉందని ఇటీవల కేబినెట్ సమావేశంలో శివకుమార్ హెచ్చరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో శివకుమార్ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి హెచ్.డీ. కుమారస్వామి ప్రశ్నలు లేవనెత్తారు. కర్ణాటక బీజేపీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర కూడా



కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. స్టింగ్ ఆపరేషన్లు నిర్వహించి వాటితో వ్యక్తులను బ్లాక్‌మెయిల్ చేయడం కాంగ్రెస్‌కు గతంలోనూ అలవాటేనని ఆరోపించారు. బీజేపీ నేత ఆర్.అశోక్ కూడా శివకుమార్ గతంలో ఇలాంటి కార్యకలాపాల్లో పాల్గొన్నందుకే ఇప్పుడు ఆందోళన చెందుతున్నారని విమర్శించారు.

కొత్త కెప్టెన్ స్మృతి మంధాన చేతిలో జట్టు భద్రంగా ఉంది : హర్మన్‌ప్రీత్



స్పోర్ట్స్, అక్టోబర్ 08 :

భారత మహిళల క్రికెట్ జట్టు సురక్షితమైన చేతుల్లోనే ఉందని, కొత్త కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన స్మృతి మంధాన జట్టును విజయపథంలో ముందుకు నడిపిస్తుందన్న పూర్తి విశ్వాసం తనకు ఉందని మాజీ సారథి హర్మన్‌ప్రీత్ కౌర్ పేర్కొంది. దశాబ్దానికి పైగా జట్టును నడిపించిన తాను ఇప్పుడు కెప్టెన్సీ నుంచి తప్పుకుంటున్నానని, స్మృతికి తన సంపూర్ణ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ఆమె స్పష్టం చేసింది. సుదీర్ఘకాలంగా స్మృతితో తనకు ఉన్న అనుబంధం, అవగాహన జట్టుకు మరింత మేలు చేస్తుందని హర్మన్‌ప్రీత్ అభిప్రాయపడింది. అన్ని ఫార్మాట్ల కెప్టెన్సీ నుంచి తప్పుకుంటున్నట్లు హర్మన్‌ప్రీత్ ప్రకటించిన విషయం తెలిసిందే. 2012లో తొలిసారి పగ్గాలు చేపట్టిన ఆమె, తన నాయకత్వంలో జట్టుకు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించింది. ఇటీవల జరిగిన ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం గెలిచిన తర్వాత ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఈ నిర్ణయం వెనుక ఏదో ఒక టోర్నమెంట్ ఫలితం కారణం కాదని, చాలాకాలంగా ఆలోచించి తీసుకున్న వ్యక్తిగత నిర్ణయమని ఆమె స్పష్టం చేసింది. ఐఏఎన్ఎస్‌తో ప్రత్యేకంగా మాట్లాడుతూ హర్మన్‌ప్రీత్ తన మనసులోని మాటలను పంచుకుంది. 'దశాబ్దానికి పైగా కెప్టెన్సీ బాధ్యతను గౌరవంగా భావించాను. జట్టు ప్రయోజనాలకే ఎప్పుడూ పెద్దపీట వేశాను. ఇప్పుడు నా ఆటను మరింత ఎక్కువగా ఆస్వాదించాలనుకుంటున్నాను. నా బ్యాటింగ్‌పై దృష్టి పెట్టడంతోపాటు, కుటుంబం, స్నేహితులతో గడిపేందుకు సమయం కేటాయించాలనే ఈ నిర్ణయం తీసుకున్నాను. అయితే, ఒక సీనియర్ ప్లేయర్‌గా, మెంటార్‌గా నా అనుభవంతో జట్టుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను' అని వివరించింది. కొత్త కెప్టెన్ స్మృతి మంధానతో తనకున్న బంధం గురించి మాట్లాడుతూ, 'నేను, స్మృతి మా కెరీర్‌లో కీలక దశలను కలిసే చూశాం. ట్రైనింగ్ నుంచి వీడియో గేమ్స్ ఆడే వరకు ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయి. మా మధ్య బలమైన అవగాహన ఉంది. ఇప్పుడు ఆమె కెప్టెన్సీలో నా పూర్తి సహకారం అందిస్తాను. మేమిద్దరం కలిసి ఈ జట్టును నిర్మించాం. కాబట్టి మా మధ్య ఉన్న నమ్మకం, శక్తి అలాగే కొనసాగుతుందని నేను కచ్చితంగా చెప్పగలను' అని హర్మన్‌ప్రీత్ వెల్లడించింది. కెప్టెన్సీ వల్ల తన వ్యక్తిగత బ్యాటింగ్‌పై ప్రభావం పడిందా అన్న ప్రశ్నకు, "కెప్టెన్‌గా కొన్నిసార్లు వ్యక్తిగత లక్ష్యాలను పక్కన పెట్టాల్సి వస్తుంది. జట్టు ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. నా బ్యాటింగ్‌ను ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు, కానీ ఇప్పుడు మరింత స్వేచ్ఛగా, స్పష్టతతో నా పాత్రను నిర్వర్తించాలనుకుంటున్నాను' అని బదులిచ్చింది. వన్డే ప్రపంచకప్ గెలవాలన్న తన చిరకాల కల నెరవేరిందని, అందుకే ఎలాంటి విచారం లేకుండా సంతృప్తిగా బాధ్యతల నుంచి తప్పుకుంటున్నానని హర్మన్‌ప్రీత్ తెలిపింది. భవిష్యత్ ప్రణాళికల గురించి చెబుతూ, 'కెప్టెన్సీ బాధ్యత ముగిసింది, కానీ ఒక క్రికెటర్‌గా నా ప్రయాణం కొనసాగుతుంది. నాలో నాయకత్వ లక్షణాలు ఎప్పటికీ ఉంటాయి. దేశం కోసం మరిన్ని ట్రోఫీలు గెలవాలన్న ఆకలి ఇంకా తీరలేదు. అభిమానుల ప్రేమ, మద్దతుతో నా అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడానికి ప్రయత్నిస్తాను. జట్టుకు అవసరమైనప్పుడు బంతితోనూ రాణించడానికి నేను సిద్ధంగా ఉన్నాను' అని హర్మన్‌ప్రీత్ కౌర్ తన సంకల్పాన్ని స్పష్టం చేశారు.

ఎలాన్ మస్క్ సక్సెస్ వెనుక సీక్రెట్ ఇదే..

- 'ఎక్స్' మాజీ సీఈఓ ఆసక్తికర వ్యాఖ్యలు
- మస్క్ పని విధానంపై యాకారినో కీలక వ్యాఖ్యలు
- ఆలస్యం చేయకుండా వెంటనే పని మొదలు పెట్టడమే ఆయన ధోరణి అని వెల్లడి
- సమస్య మూలాన్ని గుర్తించి పరిష్కరించడంపై దృష్టిపెడతారని వ్యాఖ్య
- ఫస్ట్ ప్రిన్సిపుల్స్ ఆలోచనను మస్క్ పాటిస్తారని వెల్లడి
- యువత మానవ నైపుణ్యాలపై దృష్టి పెట్టాలని యాకారినో సూచన



నెట్‌వర్క్, అక్టోబర్ 08 :

టెస్లా, స్పేస్‌ఎక్స్, ఎక్స్ వంటి సంస్థలతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఎలాన్ మస్క్ పని చేసే విధానం చాలా భిన్నంగా ఉంటుందని 'ఎక్స్' మాజీ సీఈఓ లిండా యాకారినో తెలిపారు. మస్క్‌లో తనను ఎక్కువగా ఆకట్టుకున్న విషయం ఒక్కటేనని.. అది 'తక్షణం పని మొదలుపెట్టాలనే తపన' అని చెప్పారు.ఫార్చ్యూన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో యాకారినో.. మస్క్ పని తీరును వివరించారు. ఆయనకు ఏదైనా పని పూర్తి చేయడానికి క్యాలెండర్‌లో ఉన్న గడువు కోసం ఎదురుచూడటం నచ్చదని చెప్పారు. పని చేయాల్సి వస్తే వెంటనే మొదలుపెట్టాలనేది ఆయన ఆలోచనగా ఉంటుందని తెలిపారు. 'ఒక ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి డెడ్‌లైన్ అంటూ ప్రత్యేకంగా తేదీ ఉండదు. చేయాల్సింది ఇప్పుడే చేయాలి" అనే ధోరణితో మస్క్ పనిచేస్తారని యాకారినో చెప్పారు. ఈ విధానం ఉద్యోగులు సమస్యలను చూసే తీరును కూడా మార్చుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. పనిలో అనవసరమైన ప్రక్రియలు, ఆలస్యాలను పక్కనపెట్టి అసలు సమస్య ఏంటి? దాన్ని పరిష్కరించడానికి ఏం చేయాలి? అనే విషయాలపై నేరుగా దృష్టి పెట్టేలా ఈ పద్ధతి ప్రోత్సహిస్తుందని చెప్పారు. దీన్ని ఆమె 'ఫస్ట్ ప్రిన్సిపుల్స్ థింకింగ్'తో ముడిపెట్టారు. సమస్యను ఉన్నది ఉన్నట్లుగా విశ్లేషించి, దాని మూల కారణాన్ని గుర్తించి పరిష్కారం వెతకడం ఈ ఆలోచనా విధానంలో కీలకం. 2023లో యాకారినో 'ఎక్స్'లో సీఈఓగా బాధ్యతలు చేపట్టే సమయానికి సంస్థలో మస్క్ తీసుకొచ్చిన మార్పులు కొనసాగుతున్నాయి. ట్విటర్ పేరు 'ఎక్స్'గా మారింది. సంస్థ ఉద్యోగుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఇదే సమయంలో తప్పుడు సమాచారం, ద్వేషపూరిత కంటెంట్, బాట్లకు సంబంధించిన విమర్శలు కూడా సంస్థను వెంటాడాయి. దాదాపు రెండేళ్లు ఎక్స్ సీఈఓగా పనిచేసిన యాకారినో 2025 జులైలో ఆ బాధ్యతల నుంచి తప్పుకొన్నారు. ప్రస్తుతం ఆమె హెల్త్ టెక్ రంగంలో పనిచేస్తున్నారు. మస్క్ పని విధానంతోపాటు యువతకు కూడా యాకారినో కొన్ని సూచనలు చేశారు. కృత్రిమ మేధ వల్ల భవిష్యత్తులో కొన్ని పనులు ఆటోమేటిక్‌గా మారే అవకాశం ఉందని.. అందుకే యువత సాంకేతికత సులభంగా భర్తీ చేయలేని నైపుణ్యాలపై దృష్టి పెట్టాలని చెప్పారు. నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, సృజనాత్మక ఆలోచన, విశ్లేషణాత్మక దృష్టి వంటి నైపుణ్యాలు ముఖ్యమని తెలిపారు. సౌకర్యవంతమైన పరిస్థితుల్లోనే ఉండిపోవడం మంచిది కాదని ఆమె సూచించారు. "కంఫర్ట్ అంటే కాంప్లెసెన్సీ (ఉదాసీనత)' అని పేర్కొంటూ.. సవాళ్లు ఉన్న పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని యువతకు సూచించారు.

యూపీఐ లావాదేవీలపై కొత్త ఛార్జీలు..

- పండుగల తర్వాత అమలు చేయాలంటున్న ట్రేడర్లు
- అక్టోబర్ 15 నుంచి అమల్లోకి రానున్న ఈ కొత్త ఛార్జీలు
- రూ.2,000 దాటిన వ్యాపార లావాదేవీలపై కొత్త ఛార్జీల వర్తింపు
- ఈ మార్పులు కేవలం 4శాతం వ్యాపార లావాదేవీలకే వర్తిస్తాయని ఎన్‌పీసీఐ స్పష్టీకరణ
- ఛార్జీలను కస్టమర్ల నుంచి వసూలు చేయవద్దని వ్యాపారులకు బ్యాంకులు సూచన



నెట్‌వర్క్, అక్టోబర్ 08 :

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిగే వ్యాపార లావాదేవీలపై కొత్తగా ప్రతిపాదించిన 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' (ఎండీఆర్) ఛార్జీల అమలును వాయిదా వేయాలని దేశవ్యాప్తంగా ఉన్న వ్యాపార సంఘాలు 'నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా' (ఎన్‌పీసీఐ)ని కోరాయి. అక్టోబర్ 15 నుంచి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి రానున్న నేపథ్యంలో పండుగ సీజన్ ముగిసే వరకు లేదా వచ్చే ఏడాది ప్రారంభం వరకు దీనిని వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు 'ఎన్డీటీవీ ప్రాఫిట్' తన కథనంలో పేర్కొంది. పండుగల సమయంలో అమ్మకాలు గరిష్ఠ స్థాయిలో ఉంటాయని, ఈ కీలక తరుణంలో కొత్త ఛార్జీలు అమలు చేస్తే వ్యాపారులపై ప్రతికూల ప్రభావం పడుతుందని ట్రేడ్ అసోసియేషన్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వాటాదారులతో సంప్రదింపులు జరిపిన తర్వాతే ఎన్‌పీసీఐ ఈ కొత్త ఎండీఆర్ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించింది. అయితే, వ్యాపారుల తాజా విజ్ఞప్తిపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఎన్‌పీసీఐ ప్రకటించిన కొత్త నిబంధనల ప్రకారం.. ఎంపిక చేసిన వ్యాపార కేటగిరీలలో రూ.2,000కు మించిన యూపీఐ చెల్లింపులపై ఫ్లాట్‌గా రూ.5 రుసుము విధిస్తారు. అదే సమయంలో, పెద్ద వ్యాపారులకు రూ.2,000 దాటిన లావాదేవీలపై 0.4 శాతం ఫీజు ఉంటుంది. దీనిపై గరిష్ఠ పరిమితిని రూ.300గా నిర్ణయించారు. మ్యూచువల్ ఫండ్స్, సెక్యూరిటీల వంటి క్యాపిటల్ మార్కెట్ లావాదేవీలకు 0.02 శాతం ఎండీఆర్ వర్తిస్తుంది. దీనికి కూడా గరిష్ఠ పరిమితి రూ.300గా ఉంటుంది. అయితే, ఈ మార్పుల వల్ల కేవలం 4 శాతం వ్యాపార లావాదేవీలపై మాత్రమే ప్రభావం పడుతుందని, 95 శాతానికి పైగా పర్సన్-టు-మర్చంట్ (పీ2ఎం) యూపీఐ చెల్లింపులకు ఈ ఛార్జీలు వర్తించవని ఎన్‌పీసీఐ అంచనా వేసింది. పీర్-టు-పీర్ (పీ2పీ) మోడల్‌ను ఉపయోగించే చిన్న వ్యాపారులకు ఎలాంటి ఎండీఆర్ ఛార్జీలు ఉండవని స్పష్టం చేసింది. సాధారణ వ్యక్తిగత వినియోగదారులపై ఎలాంటి ఛార్జీల భారం ఉండదు. వారు యథావిధిగా ఉచితంగా యూపీఐ చెల్లింపులు చేసుకోవచ్చు. ఈ ఎండీఆర్ ద్వారా వసూలైన ఆదాయాన్ని యూపీఐ వ్యవస్థ విస్తరణ, సైబర్ సెక్యూరిటీ మెరుగుదల, ఆవిష్కరణల కోసం వినియోగించనున్నారు. మొత్తం ఎండీఆర్ వసూళ్లలో 5 శాతాన్ని చిన్న వ్యాపారులలో యూపీఐ వినియోగాన్ని ప్రోత్సహించడానికి ఏర్పాటు చేసే ప్రత్యేక నిధికి కేటాయించనున్నారు. ముఖ్యంగా, ఈ ఎండీఆర్ ఛార్జీలను వ్యాపారులు కస్టమర్లపై మోపకుండా చూడాలని బ్యాంకులకు ఎన్‌పీసీఐ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న తమన్నా

తిరుమల, అక్టోబర్ 08 :



సినీ నటి తమన్నా తెల్లవారు జామున తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి విచ్చేసిన ఆమె, స్వామి వారి సుప్రభాత సేవలో పాల్గొన్నారు. సంప్ర దాయ వస్త్రధారణలో కనిపించి ప్రత్యేక ఆకర్ష ణగా నిలిచారు. దర్శనానంతరం ఆలయం వెలుపల తమన్నా మీడియాతో మాట్లాడుతూ.. తన అనుభూతిని పంచుకున్నారు. 'చాలా రోజుల తర్వాత స్వామివారిని దర్శించుకు న్నాను. దర్శనం చాలా బాగా జరిగింది. ఇక్కడికి వస్తే ఎంతో ఆనందంగా, ప్రశాంతంగా ఉంటుంది. చిన్నప్పటి నుంచి తిరుమలకు వస్తున్నా, కానీ ఈరోజు జరిగిన దర్శనం లాంటి అనుభూతి ఎప్పుడూ కలగలేదు. చాలా తృప్తిగా, అదృ ష్టంగా భావిస్తున్నాను. అందరి కోసం ప్రార్థించాను' అని ఆమె పేర్కొన్నారు. దర్శనం అనం తరం, రంగనాయకుల మండపంలో వేద పండితులు తమన్నాకు వేదాశీర్వచనం అందించి, శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా తమన్నాకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వృత్తిపరంగా సినిమాలతో బిజీగా ఉండే తమన్నా, కాస్త విరామం దొరికినప్పుడు ఇలా ఆధ్యాత్మిక క్షేత్రాలను సందర్శిస్తుంటారు. తెలుగులో ఆమె చివరిసారిగా 'ఓదెల 2' చిత్రంలో కనిపించారు. ప్రస్తుతం హిందీ, తమిళ ప్రాజెక్టులపై ఆమె ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

రూ. 80 కోట్ల ఆస్తులు ఉన్నా సాధారణ జీవితం గడిపిన నానా పటేకర్

గోవా, అక్టోబర్ 08 :



విలక్షణ నటనతో భారతీయ చిత్రసీమలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ప్రముఖ నటుడు, సామాజిక కార్యకర్త నానా పటేకర్ (75) కన్నుమూశారు. గోవాలోని తన నివాసంలో ఈ ఉదయం తీవ్రమైన గుండెపోటుకు గురై ఆయన తుదిశ్వాస విడిచారు. ఈ తెల్లవారుజామున నానా పటేకర్ అస్వస్థతకు గురయ్యారు. స్పృహతప్పి పడిపోవడంతో ఆయన్ను వెంటనే పనాజీలోని మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు సుమారు 45 నిమిషాల పాటు సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. ఉదయం 5:20 గంటలకు ఆయన మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని గోవా మెడికల్ కాలేజీకి తరలించారు. దాదాపు ఐదు దశాబ్దాల సినీ కెరీర్‌లో నానా పటేకర్ రూ. 50 నుంచి 80 కోట్ల ఆస్తులు సంపాదించినప్పటికీ, అత్యంత నిరాడంబరమైన జీవితాన్ని గడిపారు. ముంబైలో ఒక సాధారణ 1బీఎఖ ఫ్లాట్‌లోనే నివసించారు. రైతుల కష్టాలను చూసి చలించిపోయిన ఆయన 'నామ్ ఫౌండేషన్' స్థాపించి వేలాది రైతు కుటుంబాలకు అండగా నిలిచారు. నానా పటేకర్ మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఆయన అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. పుణె సమీపంలోని ఖడక్‌వాస్లాలో ఉన్న ఆయన ఫామ్‌హౌస్‌లో అంతిమ సంస్కారాలు జరగనున్నాయి.

వ్యక్తులు కాదు, వ్యవస్థే ముఖ్యం

అమరావతి, అక్టోబర్ 08 :

వ్యక్తులు కాదు, వ్యవస్థే ప్రధానమనే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ ఐటీ వింగ్ (ఐ-టీడీపీ) పనిచేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, ప్రతిపక్ష వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఐటీడీపీ విభాగంపై నారా లోకేశ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీకి, ప్రభుత్వానికి మధ్య ఐటీడీపీ ఒక వారధిగా నిలవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు తీరును ప్రజలకు వివరిస్తూనే, సోషల్ మీడియాలో ప్రత్యర్థులు చేసే అసత్య ప్రచారాలను ఆధారాలతో సహా తిప్పికొట్టాలని స్పష్టం చేశారు. ఐటీడీపీ కమిటీల నియామక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని లోకేశ్ ఆదేశించారు. విభాగంలోని ప్రతి సభ్యుడిని 'మై టీడీపీ యాప్'తో అనుసంధానించాలని స్పష్టం చేశారు. పార్టీలోని ఇతర విభాగాలతో సమన్వయం చేసుకుంటూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఐటీడీపీ మరింత పటిష్ఠంగా ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సమీక్షా సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ముఖ్యనేత చింతకాయల విజయ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ ఇప్పుడు సుపరిపాలనకు సాధనం

(మొదటి పేజీ తరువాయి)

5జీ బేస్ స్టేషన్లు పనిచేస్తున్నాయి. 2022తో పోలిస్తే మొబైల్ ఇంటర్నెట్ వేగం 10రెట్లు పెరిగింది' అని ప్రధాని వివరించారు. ఒక దశాబ్దం క్రితం దేశంలో 'డిజిటల్ విభజన' ఒక పెద్ద సవాలుగా ఉండే దని, కొత్త సాంకేతికత కొందరికే దక్కేదని మోదీ గుర్తుచేశారు. ఈ సమస్యను అధిగమించేం దుకే 'డిజిటల్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రారం భించామని, మొబైల్ ఫోన్‌ను కేంద్రంగా చేసు కుని డిజిటల్ సేవలను ప్రతి ఒక్కరికీ అందు బాటులోకి తెచ్చామని వివరించారు. భారతీయు లకు టెలికాం అంటే కేవలం సాంకేతికత మాత్ర మే కాదని, అంతకు మించి అని ఆయన అన్నా రు. కోవిడ్ మహమ్మారి సమయంలో భారత డిజి టల్ వ్యవస్థ ప్రాముఖ్యతను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో కార్యకలాపాలు స్తంభించిపోయినప్పుడు కూడా, మన దేశంలో కార్యాలయాలు, బ్యాంకులు, విద్యా సంస్థలు డిజిటల్ మౌలిక సదుపాయాల వల్లే నిరంతరాయంగా పనిచేయగలిగాయని గుర్తు చేశారు. ఈ ఏడాది ఐఎంసీ థీమ్ 'సరిహద్దులు లేని విస్తరణ' (Scale Without Boundaries) అని, ఇది భారత టెలికాం, డిజిటల్ మౌలిక సదుపాయాల ప్రయాణాన్ని ప్రతిబింబిస్తుందని మోదీ అన్నారు. అక్టోబర్ 7 నుంచి 10 వరకు జరగనున్న ఈ సదస్సును టెలికమ్యూనికేషన్స్ విభాగం, సెల్యులార్ ఆపరే టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఓఏఐ) సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమా నికి హాజరైన దేశ, విదేశీ టెలికాం ఆపరేటర్లు, పరిశ్రమల అధిపతులు, నిపుణులు, స్టార్టప్ ప్రతి నిధులకు ప్రధాని స్వాగతం పలికారు.

'బిల్డ్ ఏపీ' తమ నినాదమన్న సీఎం చంద్రబాబు..

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభమవుతాయని వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ అందిస్తున్న సహకారం అభినందనీయమని, పోలవరం, అమరావతి నిర్మాణానికి అండగా నిలుస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

భారత ప్రగతిలో ఏపీది కీలక పాత్ర : పీయూష్ గోయల్

ఈ కార్యక్రమంలో మాట్లాడిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, భారత అభివృద్ధి ప్రస్థానంలో ఆంధ్రప్రదేశ్‌ది చారిత్రక పాత్ర అని కొనియాడారు. శాతవాహనుల కాలం నుంచే ఆంధ్ర ప్రాంతం నౌకా వాణిజ్యానికి ప్రసిద్ధి అని గుర్తుచేశారు. విజనరీ నేత చంద్రబాబు నాయకత్వంలో ఏపీ అభివృద్ధి పథంలో దూసుకెళుతోందని ప్రశంసించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు "టీమ్ ఇండియా"గా కలిసి పనిచేస్తున్నాయని, కేంద్రం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఏపీ భారీ పెట్టుబడులను ఆకర్షిస్తోందని అన్నారు. 'ఆత్మనిర్భరత, ఆత్మవిశ్వాస్, ఆత్మరక్ష' అనే విధానాలతో దేశం ముందుకు సాగుతోందని, వికసిత్ భారత్ లక్ష్య సాధనలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐఐ డీజీ చంద్రజిత్ బెనర్జీ, అధ్యక్షుడు ముకుంద్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ మింట్‌కు సింహాచలం అప్పన్న వెండి..

- రూ.23 కోట్ల విలువైన ఆభరణాలపై కీలక నిర్ణయం!


హైదరాబాదు, అక్టోబర్ 08 :

సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారికి భక్తులు కానుకగా సమర్పించిన భారీ పరిమాణంలోని వెండిని కరిగించి, ఇటుకలుగా మార్చేందుకు దేవస్థానం అధికారులు హైదరాబాద్‌కు తరలించారు. 2019 నుంచి ఇప్పటివరకు భక్తుల నుంచి అందిన 1,182.846 కిలోల వెండిని ఈ ప్రక్రియ కోసం పంపారు. దీని ప్రస్తుత మార్కెట్ విలువ సుమారు రూ.23 కోట్లు ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆలయంలోని ఇనుప పెట్టెల్లో భద్రపరిచిన ఈ వెండికి ఆలయ అధికారులు సీల్ వేశారు. అనంతరం భారీ భద్రత నడుమ ప్రత్యేక వ్యాన్‌లో హైదరాబాద్‌లోని ప్రభుత్వ మింట్‌కు తరలించారు. ఈ వ్యాన్‌తో పాటు ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో), డిప్యూటీ ఈవో, ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు. హైదరాబాద్ మింట్‌లో ఈ వెండిని కరిగించి, దాని నాణ్యతను, కచ్చితమైన విలువను నిర్ధారిస్తారు. ఆ తర్వాత, ఆ విలువకు సమానమైన బంగారాన్ని కొనుగోలు చేసి, సింహాచలం దేవస్థానం పేరు మీద గోల్డ్ బాండ్ల రూపంలో డిపాజిట్ చేయాలన్నది అధికారుల ప్రాథమిక ప్రణాళిక. ఇదిలా ఉంటే.. ఈ వెండిపై తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి దేవస్థానం ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. శ్రీకాళహస్తి ఆలయంలో వెండి తాపడం పనుల కోసం సుమారు 500 కిలోల వెండి అవసరమని, దానిని సింహాచలం నుంచి కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఎంఎంటీసీ వంటి ప్రభుత్వ రంగ సంస్థ ద్వారా విలువ కట్టించి, నేరుగా శ్రీకాళహస్తి ఆలయానికి విక్రయించే ప్రతిపాదన కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, శ్రీకాళహస్తికి విక్రయించే అంశంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతానికి వెండిని కరిగించి, దాని విలువను నిర్ధారించేందుకే హైదరాబాద్‌కు తరలించారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాతే, వెండిని గోల్డ్ బాండ్లుగా మార్చాలా? లేక శ్రీకాళహస్తికి విక్రయించాలా? అనే దానిపై దేవదాయ శాఖ తుది నిర్ణయం తీసుకోనుంది. రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో భక్తులు సమర్పించే బంగారం, వెండిని ఈ విధంగా కరిగించి డిపాజిట్లుగా మార్చడం సాధారణంగా జరిగే ప్రక్రియే.

స్థానిక ఎన్నికల్లో వైసీపీని అడ్డుకునేందుకు కుట్ర జరుగుతోంది

అమరావతి, అక్టోబర్ 08 :

- మాజీ మంత్రి అంబటి రాంబాబు
- వైసీపీ అభ్యర్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా అధికారులపై ఒత్తిడి చేస్తున్నారన్న అంబటి
- సీఎం, మంత్రి లోకేశ్ ఆదేశాలతోనే ఇదంతా జరుగుతోందని ఆరోపణ
- నామినేషన్లు తిరస్కరిస్తే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరిక



స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను నామినేషన్ దశలోనే అడ్డుకునేందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. రిజర్వేషన్ స్థానాల్లో పోటీ చేసే తమ పార్టీ అభ్యర్థులకు అవసర మైన ధ్రువీకరణ పత్రాలను అధికారులు ఉద్దేశపూర్వకంగా జారీ చేయడం లేదని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు, మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతోనే అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారని అంబటి ఆరోపించారు. తహసీల్దార్లకు ఫోన్ చేసి ధ్రువపత్రాలు ఇవ్వొద్దని చెప్పే స్థాయికి చంద్రబాబు, లోకేశ్ దిగజారారని ఆయన వ్యాఖ్యానించారు. ఈ విషయంపై గుంటూరు జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశామని, వెంటనే సర్టిఫికెట్లు జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. సర్టిఫికెట్లు అందకపోవడం వల్ల నామినేషన్లు తిరస్కరణకు గురైతే ప్రజా ఉద్యమం చేపడతామని అంబటి హెచ్చరించారు. ఇదే సమయంలో, తాడేపల్లిలోని వైసీపీ కార్యాలయం అంశాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. గతంలో తమ ప్రభుత్వం పార్టీ కార్యాలయం కోసం రెండెకరాల భూమిని కేటాయించిందని, అయితే కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చాక నిర్మాణంలో ఉన్న భవనాన్ని కూల్చివేసిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ స్థలాన్ని శ్మశానవాటిక కోసం స్వాధీ నం చేసుకుంటున్నట్లు తహసీల్దార్ నోటీసులు ఇచ్చారని తెలి పారు. చంద్రబాబు నివాసానికి అనుమతులు లేవని ఆరోపణలు ఉన్నా, ఆయన కోర్టును ఆశ్రయించి కూల్చివేతను అడ్డుకున్నా రని విమర్శించారు. ఈ అంశంపైనా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి నట్లు చెప్పారు. ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని, నిజాయతీగా ఎన్నికలు జరిగితే కూటమి ఘోరంగా ఓడిపోవడం ఖాయమని అంబటి జోస్యం చెప్పారు. ప్రభుత్వ చర్యలతో ప్రజలు తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు.

ఎలక్టోరల్ రోల్స్ సవరణ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే : ప్రకాశ్ రాజ్



చెన్నై, అక్టోబర్ 08 :

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ పౌరుల ఓటు హక్కుకు తీవ్ర ముప్పు అని, ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే ప్రయత్నమని ప్రముఖ నటుడు, సామాజిక కార్యకర్త ప్రకాశ్ రాజ్ ధ్వజమెత్తారు. ఈ సవరణను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తిరువనంతపురంలో మీడియాతో మాట్లాడిన ఆయన, కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కోరారు. ఈ సవరణ ప్రక్రియ వల్ల దేశవ్యాప్తంగా సుమారు 13 కోట్ల మందికి పైగా పౌరులు తమ రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ప్రకాశ్ రాజ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇది సమాజంలో ఓటు హక్కు ఉన్నవారు, లేనివారు అనే రెండు వర్గాల పౌరులను సృష్టించి, దేశ సమగ్రతకు భంగం కలిగిస్తుందని హెచ్చరించారు. ఈ ప్రక్రియ అమలులో భాగస్వాములైన ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. స్వతంత్ర భారత తొలి రోజులను గుర్తుచేస్తూ.. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, జవహర్‌లాల్ నెహ్రూ వంటి మహనీయులు రైతులు, ఆదివాసీలు, దళితులు, మైనారిటీలు అనే వివక్ష లేకుండా ప్రతి పౌరుడికి ఓటు హక్కును కల్పించారని ప్రకాశ్ రాజ్ పేర్కొన్నారు. అయితే, ప్రస్తుత చర్యలు ఆ మౌలిక సూత్రాలనే దెబ్బతీస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పౌరులు తమ ఓటు హక్కును కాపాడుకోవడానికి స్వచ్ఛందంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక స్థాయిలో మరిన్ని నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు, ఈ ప్రక్రియ వల్ల నష్టపోయిన వారితో పబ్లిక్ ట్రిబ్యునల్స్ నిర్వహిస్తామని ప్రకటించారు. ఇప్పటికే పలు రాజకీయ పార్టీలు, పౌర సమాజం ఈ సవరణపై నిరసనలు తెలుపుతున్న తరుణంలో ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

పవన్ కల్యాణ్ పేరుతో తప్పుడు ఎక్స్ ఖాతా

- నారా లోకేశ్ పై ఫేక్ పోస్టులు.. వ్యక్తి అరెస్ట్
- పవన్ కల్యాణ్ పేరిట నకిలీ ఎక్స్ ఖాతా సృష్టించిన నిందితుడు
- హైదరాబాద్‌లో నిందితుడు రాకేశ్‌ను అరెస్ట్ చేసిన నల్లపాడు పోలీసులు
- టీడీపీ-జనసేన మధ్య విభేదాలు సృష్టించేందుకు కుట్రగా అనుమానం

మంగళగిరి, అక్టోబర్ 08 :



ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నాడన్న ఆరోపణలపై నల్లపాడు పోలీసులు ఒక వ్యక్తిని అరెస్ట్ చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని ఎర్రబాలెంకు చెందిన తీర్థాల నాగ వెంకట దుర్గ రాకేశ్ ను హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని, అనంతరం గుంటూరుకు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం, నిందితుడు రాకేశ్.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేరుతో ఒక నకిలీ ఎక్స్ (ట్విట్టర్) ఖాతాను సృష్టించాడు. ఈ ఖాతా ద్వారా నారా లోకేశ్ ప్రతిష్టకు భంగం కలిగించేలా కల్పిత పోస్టులు, వీడియోలను సర్క్యులేట్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అధికార కూటమిలోని తెలుగుదేశం, జనసేన పార్టీల మధ్య విభేదాలు సృష్టించేందుకే ఈ దుష్ప్రచారం చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై ఇప్పటికే కేసు నమోదు కాగా, పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ కల్పిత వీడియోల మూలాలు ఎక్కడివి, ఈ వ్యవహారంలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉంది అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. రాజకీయ నాయకులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను అరికట్టేందుకు అధికారులు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈ అరెస్ట్ జరిగింది.

కూటమి ప్రభుత్వం యువత భవిష్యత్తుతో ఆడుకుంటోంది



- గంజాయి నిర్మూలన హామీ ఏమైందని ప్రభుత్వాన్ని నిలదీసిన శ్యామల
- టీవీ షోలపై కాకుండా గంజాయిపై దృష్టి పెట్టాలని హోంమంత్రికి హితవు
- రాష్ట్రంలో మాదకద్రవ్యాలు విచ్చలవిడిగా దొరుకుతున్నాయని ఆరోపణ

అమరావతి, అక్టోబర్ 08 :

కూటమి ప్రభుత్వం యువత భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని, రాష్ట్రంలో మాదకద్రవ్యాలను నియంత్రించడంలో పూర్తిగా విఫలమైందని వైసీపీ అధికార ప్రతినిధి శ్యామల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల సమయంలో గంజాయిని సమూలంగా నిర్మూలిస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేశ్ ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని శ్యామల అన్నారు. 'హోంమంత్రి వంగలపూడి అనితకు టీవీ షోల టీఆర్పీలపై ఉన్న శ్రద్ధ గంజాయి కేసులను అరికట్టడంపై లేదు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో గంజాయి లేకుండా చేస్తానన్న ఆమె సవాల్ ఏమైంది?' అని ఎద్దేవా చేశారు. కూటమి నేతలు ఆడుతున్నది యువత భవిష్యత్తును నాశనం చేసే 'టాక్సిక్ గేమ్' అని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో గంజాయి, లిక్విడ్ గంజాయి, ఎండీఎంఏ వంటి మాదకద్రవ్యాల విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని శ్యామల అన్నారు. ఇటీవల అనకాపల్లిలో రూ.3 కోట్ల విలువైన గంజాయి, అల్లూరి జిల్లాలో రూ.1.34 కోట్ల విలువైన లిక్విడ్ గంజాయి పట్టుబడటమే ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లాలో పోలీసుల కారులోనే గంజాయి దొరకడం సిగ్గుచేటని విమర్శించారు. 'ఈగల్' వెబ్‌సైట్ లెక్కల ప్రకారం రాష్ట్రంలో వేల కేసులు నమోదు చేసి, 6 లక్షల కిలోలకు పైగా గంజాయిని పట్టుకున్నారని.. అలాంటప్పుడు గంజాయే లేదని ఎలా ప్రచారం చేస్తున్నారని ప్రభుత్వాన్ని ఆమె నిలదీశారు. ఆపరేషన్ చైతన్య, గరుడ వంటి కార్యక్రమాలు విఫలమయ్యాయని, ప్రభుత్వం మాటలు చెప్పడం మాని చేతల్లో చూపించాలని హితవు పలికారు.

టీడీపీ యాత్రపై ప్రధాని ప్రశంసలు.. కృతజ్ఞతలు తెలిపిన నారా లోకేశ్



- ప్రధానికి ట్విట్టర్ వేదికగా కృతజ్ఞతలు తెలిపిన నారా లోకేశ్
- తిరుపతి నుంచి కాశీకి కృష్ణా, గోదావరి జలాలతో బైక్ యాత్ర
- ప్రభుత్వాధినేతగా మోదీ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా టీడీపీ 'సేవా సంకల్ప యాత్ర'
- మీ మాటలు కార్యకర్తలకు ఎంతో స్ఫూర్తినిచ్చాయన్న లోకేశ్

ఢిల్లీ, అక్టోబర్ 08 :

తెలుగుదేశం పార్టీ నిర్వహించిన 'సేవా సంకల్ప యాత్ర'ను ప్రశంసించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆంధ్రప్రదేశ్ మంత్రి, టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. ప్రధాని అందించిన ప్రోత్సాహకర వ్యాఖ్యలు తమ పార్టీ కార్యకర్తల్లో నూతనోత్తేజాన్ని నింపాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ తన పోస్టులో.. 'ధన్యవాదాలు నరేంద్ర మోదీ గారూ. గత 25 ఏళ్లుగా మీరు అందిస్తున్న నిరంతర సేవలు, సుపరిపాలనకు నివాళిగా ఈ యాత్రను ఒక చిన్న కానుకగా భావిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, గోదావరి నదుల పవిత్ర జలాలను కాశీ క్షేత్రానికి తీసుకెళ్లడం మాకు దక్కిన అరుదైన గౌరవం. ఇది మన ప్రజలు, సంప్రదాయాలు, దేశాన్ని ఏకం చేసే బంధాలను చాటిచెబుతోంది. ఈ యాత్రలో పాలుపంచుకున్న ప్రతి కార్యకర్తకు మీ మాటలు ఎంతో స్ఫూర్తినిచ్చాయి' అని వివరించారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా, భారత ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ ప్రభుత్వ అధినేత బాధ్యతల్లో 25ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని టీడీపీ ఈ 'సేవా సంకల్ప యాత్ర'ను నిర్వహించింది. ఇందులో భాగంగా టీడీపీ శ్రేణులు తిరుపతి నుంచి కాశీ వరకు సుమారు 2,000 కిలోమీటర్ల మేర బైక్ యాత్రను చేపట్టాయి. ఏపీలోని కృష్ణా, గోదావరి నదుల పవిత్ర జలాలను సేకరించి, కాశీ విశ్వనాథునికి జలాభిషేకం నిర్వహించడం ఈ యాత్ర ప్రధాన ఉద్దేశం. అంతకుముందు ఈ యాత్రపై ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. ఏపీ నుంచి నదీ జలాలను సేకరించి తీసుకురావడం తనను ఎంతో కదిలించిందని పేర్కొన్నారు. ఈ బృహత్ కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేసిన టీడీపీ నేతలను, కార్యకర్తలను ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు.

పన్ను కట్టే మమ్మల్నే ప్రశ్నిస్తారా?


- సీఎం ముందే నిలబీసిన నానా పటేకర్.. వైరల్ అవుతున్న పాత వీడియో!
- రెండేళ్ల క్రితం నానా పటేకర్ చేసిన వ్యాఖ్యలు మళ్లీ చర్చనీయాంశం
- పన్ను చెల్లింపుదారులపై విచారణ, అవినీతి నేతలకు మినహాయింపా అని ప్రశ్న
- మహారాష్ట్ర సీఎం, డిప్యూటీ సీఎంలను వేదికపైనే సూటిగా అడిగిన వైనం
- అవినీతి వ్యవస్థాగత సమస్య అని, సమాజం మారాలని బదులిచ్చిన ఫడ్నవిస్
- నానా పటేకర్ మరణ వార్తల నేపథ్యంలో వైరల్ అవుతున్న పాత వీడియో

మహారాష్ట్ర, అక్టోబర్ 08 :

ప్రముఖ నటుడు నానా పటేకర్ మరణ వార్తల నేపథ్యంలో, ఆయన గతంలో రాజకీయ నాయకులను ఉద్దేశించి చేసిన కొన్ని ఘాటైన వ్యాఖ్యలు మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 2022లో జరిగిన ఒక అవార్డుల కార్యక్రమంలో సామాన్యులు పన్నులు కడుతున్నా వేధింపులకు గురవుతున్నారని, కానీ అవినీతిపరులైన రాజకీయ నాయకులు మాత్రం తప్పించుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలు ఆయన నిర్భీతికి, సామాజిక బాధ్యతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. 2022లో జరిగిన 'లోక్‌మత్ మహారాష్ట్రియన్ ఆఫ్ ది ఇయర్' అవార్డుల ప్రదానోత్సవానికి అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వేదికపై మాట్లాడిన నానా పటేకర్, వారిని సూటిగా ప్రశ్నించారు. 'మనం రూ.100 సంపాదిస్తే, అందులో రూ.30 ఆదాయపు పన్నుగా చెల్లిస్తాం. దానితో పాటు 18 శాతం జీఎస్టీ కూడా కడతాం. ఇంత పన్ను కట్టిన తర్వాత కూడా సామాన్యులపై విచారణలు, దర్యాప్తులు జరుగుతాయి. మరి వేల కోట్లు దోచుకుంటున్న అవినీతి రాజకీయ నాయకులను ఎందుకు విచారించడం లేదు?' అని ఆయన నిలదీశారు. కొందరు ప్రజా ప్రతినిధులు ఎన్నికైన కొద్దికాలంలోనే విపరీతంగా ఆస్తులు ఎలా కూడబెడుతున్నారని ప్రశ్నిస్తూ, వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. నానా పటేకర్ ప్రశ్నలకు దేవేంద్ర ఫడ్నవిస్ స్పందిస్తూ సమాధానమిచ్చారు. అవినీతి అనేది ఒక వ్యవస్థాగత సమస్య అని, దాన్ని నిర్మూలించడానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని అన్నారు. కొన్నిసార్లు అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న వారినే ప్రజలు మళ్లీ ఎన్నుకుంటున్నారని, సమాజం మంచి, చెడుల మధ్య తేడాను స్పష్టంగా గుర్తించినప్పుడే నిజమైన మార్పు సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. నానా పటేకర్ ధైర్యానికి ప్రతీకగా నిలిచిన ఈ పాత సంభాషణ ఇప్పుడు మళ్లీ తెరపైకి వచ్చింది. ఉన్నత పదవుల్లో ఉన్నవారిని సైతం ప్రజా సమస్యలపై సూటిగా ప్రశ్నించిన ఆయన వ్యక్తిత్వాన్ని పలువురు గుర్తు చేసుకుంటున్నారు. కేవలం నటుడిగానే కాకుండా, సామాజిక స్పృహ కలిగిన వ్యక్తిగా ఆయన ఎప్పటికీ గుర్తుండిపోతారని ప్రశంసిస్తున్నారు.

తెలంగాణ ఓటర్ల జాబితాలో 71.23 లక్షల మందిని చేర్చేందుకు ఆమోదం

హైదరాబాదు, అక్టోబర్ 08 :



తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా, తుది జాబితాలో చేర్చేందుకు 71.23 లక్షల మందిని అర్హులుగా గుర్తించినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సి.సుదర్శన్ రెడ్డి తెలిపారు. అక్టోబర్ 7వ తేదీ నాటికి నోటీసులపై విచారణ పూర్తి చేసి, వీరి పేర్లు చేర్చేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. ఓటర్ల జాబితాలోని రికార్డులలో వ్యత్యాసాలు, ఇతర సాంకేతిక కారణాల రీత్యా మొత్తం 92.88 లక్షల నోటీసులు జారీ చేయగా, అందులో 91.92 లక్షల నోటీసులను ఓటర్లకు అందజేశారు. అక్టోబర్ 7వ తేదీతో క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ గడువు ముగిసింది. ఈ అభ్యంతరాలను నవంబర్ 5వ తేదీలోగా పరిష్కరించి, నవంబర్ 9న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆగస్టు 17న ఎన్నికల సంఘం ఇంటింటి సర్వే అనంతరం విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 3.38 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 73.39 లక్షల మందిని మరణించిన, చిరునామా మారిన లేదా నకిలీ ఓటర్లుగా గుర్తించారు. సుమారు 57.46 లక్షల మంది శాశ్వతంగా చిరునామా మార్చుకోగా, 9.22 లక్షల మంది మరణించినట్లు, మరో 6.70 లక్షల మంది ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు నమోదు చేసుకున్నట్లు వెల్లడైంది. ఇదిలా ఉండగా, రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఒకే ఇంటి నంబర్‌పై 15 లేదా అంతకంటే ఎక్కువ ఓట్లు ఉన్న కేసులను క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా పునఃపరిశీలన (రీ-వెరిఫికేషన్) చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని బీజేపీ కోరింది. తమ డేటా విశ్లేషణలో ఇలాంటి ఓట్లు సుమారు 1.63 లక్షల వరకు ఉన్నట్లు గుర్తించామని, వీటిని బూత్ స్థాయి అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆ పార్టీ విజ్ఞప్తి చేసింది.

ఎస్సీ ఎస్టీ ఉప ప్రణాళిక చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

అనంతపురం, అక్టోబర్ 08, దరువు న్యూస్ :



ఎస్సీ ఎస్టీ ఉప ప్రణాళిక చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29వ తేదీన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపట్టామని వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి మందల రమేష్ తెలిపారు. గురువారం ఆ సంఘం కార్యాలయంలో ముట్టడి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన 13 ఏళ్ల నుండి దళితుల అభివృద్ధిలో భాగమైన విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో దళితుల వాటా అయిన 15 శాతం రిజర్వేషన్లను పటిష్టంగా అమలు చేయక దళితుల అభివృద్ధికి తూట్లు పడుతుందన్నారు. అదే తరహాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత ప్రభుత్వం దళితుల అభివృద్ధి సంక్షేమ 27 పథకాలను రద్దు చేస్తే, ప్రస్తుత రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేసిన పథకాలను పునరుద్ధిస్తామని హామీనిచ్చారన్నారు. మా ఓట్లతో అధికారంలోకి వచ్చి మూడేళ్లవుతున్నా.. సంక్షేమ 27 పథకాలను పునర్దించకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం తరహాలోనే వ్యవహరిస్తున్న విధానాన్ని తీవ్రంగా ఖండించారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ద్వారా దళిత గిరిజన కాలనీలలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, వైద్య ఆసుపత్రుల కోసం ఖర్చు పెట్టాల్సిన నిధులను ఇతర శాఖలకు మళ్లించి దళితుల అభివృద్ధికి తీరని ద్రోహం చేస్తున్నారన్నారు. మా హక్కులైన ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, సంక్షేమ 27పథకాలను పునర్దించాలని, ఈనెల 29న కలెక్టరేట్ ముట్టడి చేపట్టామన్నారు. కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా దళిత ప్రజలు, విద్యార్థులు, నిరుద్యోగులు, మేధావులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎలఆర్పీఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బడికి రాజు, నాయకులు కిష్టప్ప, పవన్, శివ, శంకర్, గోపాల్, రాయుడు, హరి, మహేష్, రాజు, సాకే రమేష్, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

సొమ్ము ఒకరిది.. సోకు పరిటాల వాళ్లది

- ఈవీఎంల ట్యాంపరింగ్ తోనే కూటమి రాజ్యం ఏర్పడింది
- వైసీపీ నాయకులు కార్యకర్తలకు ఐడి కార్డులు పంపిణీ ఐదు లక్షల బీమా సౌకర్యం
- స్థానిక ఎన్నికల విజయానికి సమిష్టిగా కృషి చేయాలి
- సమావేశంలో తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి దిశా నిర్దేశం



ఆత్మకూరు అక్టోబర్ 8, దరువు న్యూస్ :

ఆత్మకూరు మండలంలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిపై సొమ్ము మాది సోకు పరిటాల కుటుంబానిది అని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తీవ్రస్థాయి విమర్శలతో విరుచుకుపడ్డాడు గురువారం మండల కేంద్రం ఆత్మకూరులోని కనకదాసు కళ్యాణ మండపంలో మండల స్థాయి నాయకులు కార్యకర్తలు సమన్వయ సమావేశము వైఎస్ఆర్ పార్టీ ఐడి కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హాజరయ్యారు. నాయకులు కార్యకర్తలు ప్రకాష్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. సమావేశానికి వొడ్డుపల్లి నరసింహారెడ్డి అధ్యక్షతన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. ఆత్మకూరు మండలంలో రెండు సబ్ స్టేషన్లు బీటీ రోడ్లకు 2018 లోనే మంజూరు చేయించామని అన్నారు మేము కష్టపడి తెచ్చిన పనులకు పరిటాల కుటుంబం గొప్పలు చెప్పుకుంటుందని విమర్శించారు. పేరూరు డ్యామ్‌కి నీరు తెచ్చి రైతాంగాన్ని సస్యశ్యామలం చేశామన్నారు. నేడు సాగునీరు లేక బోర్లు ఎండి రైతుల అనేక ఇబ్బందులకు గురవుతున్నారని మండిపడ్డారు. అంతే కాకుండా వేపచెర్లలో గోపాలకుంట కు 40 లక్షలతో కాలువ ఏర్పాటు చేశామని కేవలం ఐదు లక్షలు హెచ్చించే మిగిలిన పనులు చేస్తే పూర్తి అయ్యే రైతులకు సాగునీరు అందుతాయి అన్నారు కానీ ఆ పనులు పూర్తి చేయడంలో ప్రస్తుతం ఎమ్మెల్యే నిర్లక్ష్యం చేయడం హేమమయమని హితువు పలికారు. వైయస్సార్ ప్రభుత్వంలోనే మదిగుబ్బలో సచివాలయం హెల్త్ కేర్ కేంద్రం కు 90శాతం పనులు మేమే పూర్తి చేశామని అరకొర పనులు 10శాతం పనులు చేసి ఆర్భాటాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు త్వరలోనే స్థానిక ఎన్నికలు జరుగుతాయని సూచించారు గ్రామస్థాయిలో ఏ రిజర్వేషన్ వచ్చినా పోటీ చేయడానికి వైయస్సార్ పార్టీ అభ్యర్థులు సిద్ధం కావాలన్నారు. సమస్యలు వచ్చినా పుష్పాల తగ్గే ప్రసక్తే ఉండకూడదని మీ వెంట తోపుదుర్తి కుటుంబం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆత్మకూరు మండలంలో తోపుదుర్తి పియాలేరు వేపచెర్ల సనప వడ్డుపల్లి ముట్టాలా గొరిదిండ్ల గ్రామాలలో వైసీపీ పార్టీకి పట్టు ఉందన్నారు. తలుప్పరీరు రంగంపేట మదిగుబ్బ గ్రామాలలో పార్టీ బలోపేతానికి గట్టిగా కృషి చేయాలని సూచించారు. శ్రీ సర్పంచులు ఎంపీపీ జడ్పిటిసి స్థానాలు ఎక్కువ శాతం మనికే వస్తాయని ధీమా వ్యక్తం చేశాడు మండల నాయకులు వాసుదేవరెడ్డి రామాంజనేయులు మాజీ సర్పంచ్ పార్వతమ్మ తదితరులు మాట్లాడుతూ.. అందరం సమన్వయంగా పనిచేస్తేనే వైయస్సార్ పార్టీ అధికారంలోకి వస్తుంది జగన్ సీఎం అవుతాడు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఎమ్మెల్యే అవుతాడు అప్పుడు జగన్ రాజ్యాంగం వస్తుంది గ్రామస్థాయిలో మన రాజ్యాంగం మే మనం చెప్పిందే శాసనం అవుతుంది అని చివరికి ఎమ్మెల్యే చెప్పిన వినే ప్రసక్తే లేదని వ్యాఖ్యానించారు. అనంతరం కార్యకర్తలు నాయకులకు ఐడి కార్డులు పంపిణీ చేశారు కార్డు ఉన్న వ్యక్తులకు బీమా కింద ఐదు లక్షల రూపాయలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైయస్సార్ పార్టీ నాయకులు బంధువుకు మధుసూదన్ పంపునూరు సుభద్రమ్మ సిద్దరాంపురం పాలపోతున్న వై కొత్తపల్లి బాలస్వామి రెడ్డి అతికిరెడ్డి మాజీ ఎంపీపీ హేమలత దాబా మల్లన్న వడ్డుపల్లి మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ రెడ్డి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కార్యకర్తలు హాజరయ్యారు.

3వ రోజుకు చేరిన కాంట్రాక్ట్ వైద్యుల పోరాటం

- అత్యవసర సేవలు బంద్ కావడంతో నిలిచిన వైద్యం
- జిల్లా వ్యాప్తంగా మరింత ఉధృతంగా కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన
- వైద్య సేవలు అందక రోగుల అవస్థలు.. ప్రభుత్వ నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం
- సమ్మెకు పెరుగుతున్న మద్దతు.. అండగా నిలిచిన ప్రభుత్వ వైద్యుల సంఘం
- సమ్మెపై ప్రభుత్వ ఉక్కుపాదం.. జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవితో పాటుడ పలువురికి షోకాజ్ నోటీసులు



అనంతపురం, అక్టోబర్ 08, దరువు న్యూస్ :

ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్టు ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా అనంతపురం జిల్లావ్యాప్తంగా సాగుతున్న నిరవధిక సమ్మె మూడవ రోజుకు చేరింది. రోజురోజుకూ ఈ ఉద్యమం మరింత ఉధృతంగా మారుతోంది. ఆసుపత్రులలోని అన్ని విభాగాలకు చెందిన కాంట్రాక్టు ఉద్యోగులు పూర్తి స్థాయిలో విధులను బహిష్కరించి ఈ పోరాటంలో మమేకమయ్యారు. గత రెండు రోజులుగా కొనసాగుతున్న ఆందోళనలకు ప్రభుత్వం నుండి ఎలాంటి స్పష్టమైన హామీ లభించకపోవడంతో, మూడవ రోజు కూడా అత్యవసర వైద్య సేవలను ఉద్యోగులు పూర్తిగా నిలిపివేశారు. అనంతపురం ప్రభుత్వ సర్వజనాసుపత్రితో పాటు జిల్లాలోని అన్ని ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. అత్యవసర విభాగాలు కూడా మూతపడటంతో నిరుపేద రోగులు చికిత్స అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆసుపత్రి ప్రాంగణంలో కాంట్రాక్ట్ నర్సులు, పారా మెడికల్ సిబ్బంది చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడవ రోజుకు చేరుకున్నాయి. సమ్మెను భగ్నం చేసేందుకు ప్రభుత్వం అధికారులు, యంత్రాంగం ద్వారా ఒత్తిడి పెంచుతోంది. ఇందులో భాగంగానే విధులు బహిష్కరించిన పలువురు కాంట్రాక్ట్ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం జిల్లావ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ముఖ్యంగా నర్సెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవికి ప్రభుత్వం షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీనితో పాటు జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో విధులకు హాజరుకాని స్టాఫ్‌కు కూడా అధికారులు షోకాజ్ నోటీసులు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఉక్కుపాదానికి, ఈ బెదిరింపులకు తాము భయపడేదే లేదని, నోటీసులతో ఉద్యమాన్ని అణచలేరని ఉద్యోగ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ సమ్మెకు ఏపీ హంస అధ్యక్షులు మహమ్మద్ షఫీ, కార్యదర్శి వేణుగోపాల్, ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షులు నాగేంద్ర నేరుగా హాజరై తమ పూర్తి సంఘీభావం ప్రకటించారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల డిమాండ్లు అత్యంత న్యాయమైనవని, వీరికి తమ సంఘాల మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా జెఎసి చైర్మన్ శరత్‌బాబు, నర్సెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ.. తాము ఎన్నో ఏళ్లుగా నమ్ముకున్న రెగ్యులరైజేషన్, వంద శాతం పూర్తి వేతనం వంటి డిమాండ్లపై ప్రభుత్వం జీఓలు విడుదల చేసే వరకు వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేశారు. అక్టోబర్ 3 డెడ్‌లైన్ ముగిసినా మంత్రులు, అధికారులు ఫైళ్లు కదల్చకుండా కాలయాపన చేయడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని, రోగుల కష్టాలకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

లక్ష్మీ హాస్పిటల్‌లో ఉచిత కంటి, బీపీ పరీక్షలు



పామిడి, అక్టోబర్ 8, దరువు న్యూస్ :

ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పామిడిలోని లక్ష్మీ హాస్పిటల్ నందు ఉచిత కంటి, రక్తపోటు (బీపీ) పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోనల్ చైర్మన్ లయన్ డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు, జిల్లా చైర్మన్ లయన్ పీఎస్.జయరామారావు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు పట్రా శ్రీనివాసులు, ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ అంజి నాయక్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడం ద్వారా దృష్టి లోపాలను ముందే నివారించవచ్చని సూచించారు. అనంతరం డాక్టర్ అంజి నాయక్ ఆధ్వర్యంలో రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో పట్టణ, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉచితంగా కంటి పరీక్షలు, బీపీ టెస్టింగ్ చేయించుకున్నారు. లక్ష్మీ హాస్పిటల్ యాజమాన్యం, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, సిబ్బంది రోగులకు అవసరమైన సేవలను అందించి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

అనుమతులు లేని లేఅవుట్లపై ఉక్కుపాదం!

- లేఅవుట్లు, భవన నిర్మాణాలకు పుడా అనుమతి తప్పనిసరి
- నిబంధనలు ఉల్లంఘిస్తే అధికారులపైనా శాఖాపరమైన చర్యలు
- ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేసే ముందు అనుమతులు పరిశీలించాలి
- జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



పుట్టపర్తి, అక్టోబర్ 8, దరువు న్యూస్ :

శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న అనధికార లేఅవుట్లు, నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న భవన నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పుట్టపర్తి పట్టణాభివృద్ధి సంస్థ ఉపాధ్యక్షుడు, జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు, నిర్మాణాలు చేపడుతూ ప్రజలను మభ్యపెట్టే వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. గురువారం కదిరి డివిజన్ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, డివిజన్ స్థాయి పంచాయతీ అధికారులు, జిల్లా పంచాయతీ అధికారులతో జాయింట్ కలెక్టర్ వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో అనధికారికంగా ఏర్పాటవుతున్న లేఅవుట్లు, ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాలను తక్షణమే గుర్తించి, చట్ట ప్రకారం నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముందస్తు అనుమతులు లేకుండా లేఅవుట్లు ఏర్పాటు చేసి ప్లాట్లను విక్రయించే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. భవిష్యత్తులో క్షేత్రస్థాయిలో అనధికార లేఅవుట్లు, నిబంధనలకు విరుద్ధమైన నిర్మాణాలు వెలుగులోకి వస్తే వాటిపై చర్యలు తీసుకోకుండా చూసీచూడనట్లు వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అవసరమైన అనుమతులు పొందిన తర్వాతే ప్లాట్ల విక్రయాలు, భవన నిర్మాణాలు జరిగేలా స్థానిక అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ప్లాట్లు కొనుగోలు చేసే ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. వెంచర్ లేదా లేఅవుట్‌కు పుట్టపర్తి పట్టణాభివృద్ధి సంస్థ అనుమతి ఉందో లేదో, అనుమతి సంఖ్య, సంబంధిత పత్రాలను విక్రేత నుంచి తప్పనిసరిగా పరిశీలించాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పట్టణ, దేశ ప్రణాళిక విభాగం లేదా పుట్టపర్తి పట్టణాభివృద్ధి సంస్థ అధికారిక అంతర్జాల వేదికలో అనుమతి పొందిన లేఅవుట్ల వివరాలను పరిశీలించవచ్చన్నారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి లేదా పుట్టపర్తి పట్టణాభివృద్ధి సంస్థ కార్యాలయాన్ని సంప్రదించి ప్లాట్ లేదా భవనానికి చట్టబద్ధమైన అనుమతులు ఉన్నాయో లేదో నిర్ధారించుకున్న తర్వాతే కొనుగోలు ఒప్పందాలు చేసుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా లేఅవుట్లు ఏర్పాటు చేయడం, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టడం వల్ల భవిష్యత్తులో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని, అందువల్ల అధికారులు ముందస్తు చర్యలు చేపట్టి అక్రమ లేఅవుట్లను అడ్డుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో పుట్టపర్తి పట్టణాభివృద్ధి సంస్థ సహాయ ప్రణాళికాధికారి, పట్టణ ప్రణాళిక సహాయకుడు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా మద్యం దుకాణాల లైసెన్సుల కేటాయింపు

- 17 దుకాణాలకు నోటిఫికేషన్.. 10 దుకాణాలకు లాటరీ ద్వారా లైసెన్సులు
- 47 దరఖాస్తులు.. దరఖాస్తులు రాని 7 దుకాణాలపై త్వరలో నిర్ణయం
- అక్రమ విక్రయాలు, బెల్ట్ షాపులు, ధరల ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



పుట్టపర్తి, అక్టోబర్ 8, దరువు న్యూస్ :

శ్రీ సత్యసాయి జిల్లాలో నూతన మద్యం విధానం 2026-27 లీజు సంవత్సరానికి సంబంధించి మద్యం దుకాణాల లైసెన్సుల కేటాయింపు ప్రక్రియ గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పారదర్శకంగా పూర్తయింది. జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ నేతృత్వంలో దరఖాస్తుదారుల సమక్షంలో లాటరీ పద్ధతిలో లైసెన్సుల కేటాయింపు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జిల్లా పరిధిలో మొత్తం 17 మద్యం దుకాణాలకు ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. వీటిలో 10 దుకాణాలకు 47 దరఖాస్తులు అందగా, మిగిలిన 7 దుకాణాలకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. దీంతో దరఖాస్తులు అందిన 10 దుకాణాలకు లాటరీ నిర్వహించి లైసెన్సీలను ఎంపిక చేశారు. ధర్మవరం పరిధిలో తాడిమర్రి మండలంలోని ఒక దుకాణానికి జి. జగదీశ్, ముదిగుబ్బ మండలంలోని రెండు దుకాణాలకు డి.రామమోహన్, జి.శివసాయి నాయుడు, ఆనంద్, బత్తలపల్లి పరిధిలోని ఒక దుకాణానికి కె.చంద్రబాబు నాయుడు ఎంపికయ్యారు. హిందూపురం పరిధిలోని పరిగి మండలంలో ఒక దుకాణానికి ఎం.వి. చరణ్ లైసెన్స్ పొందారు. పుట్టపర్తి పరిధిలో కొత్తచెరువు మండలంలోని ఒక దుకాణానికి సి. సోమ్‌శేఖర్, నల్లమాడ మండలంలోని ఒక దుకాణానికి జి.లోకేష్ ఎంపికయ్యారు. మడకశిర పరిధిలో మడకశిర నగర పంచాయతీలోని ఒక దుకాణానికి పి.వి. వైష్ణవి, రొళ్ల మండలంలోని ఒక దుకాణానికి సి.లోకేష్ లాటరీ ద్వారా లైసెన్సులు పొందారు. ఎంపికైన లైసెన్సీలు ప్రభుత్వ నిబంధనలకు లోబడి, నిర్ణయించిన వేళల్లో మాత్రమే దుకాణాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సూచించారు. ఎలాంటి అక్రమ మద్యం విక్రయాలు, బెల్ట్ షాపుల నిర్వహణ, అధిక ధరలకు విక్రయించడం వంటి నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడితే లైసెన్సులు రద్దు చేయడంతో పాటు చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా సౌకర్యం, శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని ఎక్సైజ్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. దరఖాస్తులు రాని మిగిలిన 7 దుకాణాల విషయంలో ప్రభుత్వ తదుపరి ఆదేశాల మేరకు త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

23వ రోజుకు చేరిన వీఆర్ఏల సమ్మె



పామిడి, అక్టోబర్ 08, దరువు న్యూస్ :

తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ రెవెన్యూ సహాయకులు ఉద్యమ బాట పట్టారు. రాష్ట్ర వీఆర్ఏల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు రిలే నిరాహార దీక్షలు గ్రామ రెవిన్యూ సహాయ నిరాకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే 23 రోజులు గడుస్తున్నా.. ప్రభుత్వం ఏమాత్రం స్పందించలేదని తెలిపారు. ఈ సందర్భంగా వీఆర్ఏలు మాట్లాడుతూ.. వీఆర్ఏలందరికీ తెలంగాణ తరహాలో పే స్కేల్ అమలు చేయాలని, అర్హత కలిగిన వీఆర్ఏలకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ విధానంలో వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలని, నామినీలుగా పనిచేస్తున్న వారందరినీ వీఆర్ఏలుగా నియమించాలని వారు ప్రధానంగా డిమాండ్ చేశారు. వీటితో పాటు మృతిచెందిన వీఆర్ఏల కుటుంబాల్లో అర్హులైన వారికి వయసు, విద్యార్హతలతో సంబంధం లేకుండా కారుణ్య నియామకాల కింద ఉద్యోగావకాశం కల్పించాలని కోరారు. తమ ప్రధాన సమస్యలపై గత రెండేళ్లుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని, సమస్యల పరిష్కారం కోసం ఏపీ వీఆర్ఏల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళగిరిలోని సీసీఎల్ఏ కార్యాలయం వద్ద 'చలో సీసీఎల్ఏ' కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అప్పట్లో సమస్యలు పరిష్కరించకపోతే ఏపీ గ్రామ రెవెన్యూ సహాయ నిరసన చేపడతామని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆ నిర్ణయంలో భాగంగానే రాష్ట్రంలోని ప్రతి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరాహార దీక్షా శిబిరాలు నిర్వహించాలని జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయించిందని, తమ డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని కోరారు. తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని తహసీల్దార్‌ను విజ్ఞప్తి చేశారు. హక్కుల కోసం నిరాహార దీక్షలు చేపట్టామని, సమస్యల పరిష్కారం వరకు పోరాటం కొనసాగిస్తాం అని వీఆర్ఏలు స్పష్టం చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉన్నాం

అనంతపురం, అక్టోబర్ 08, దరువు న్యూస్ :

అమరావతిలోని ఏపీ ఎలక్షన్ కమీషన్ కార్యాలయం నుంచి గురువారం స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై జిల్లా కలెక్టర్‌లు, ఎస్పీలు, ఆయా శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలెక్షన్ కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ ఐఏఎస్ (రిటైర్డ్) సమీక్ష నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలా సన్నద్ధంగా ఉన్నామని వివరించారు. ఎలెక్షన్ కమిషనర్ ఇచ్చిన ముఖ్యమైన సూచనలు పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి సమస్యలు లేవన్నారు. ముఖ్యంగా మెటీరియల్ ఏర్పాట్లు, సంబంధిత రిజర్వేషన్లకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి అన్ని రకాల చర్యలు చేపడుతున్నామన్నారు.

శంకర్ రావు పార్థివ దేహానికి నివాళి : పామిడి వీరా

పామిడి, అక్టోబర్ 08, దరువు న్యూస్ :



పట్టణ పరిధిలోని హనుమాన్ టాకీస్ సమీపంలో మాజీ టౌన్ కన్వీనర్ జోజోడు కుమార్ తండ్రి శంకర్ రావు (77) మరణించారు. విషయం తెలుసుకున్న ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరా వారి ఇంటి దగ్గరకి వెళ్లి శంకర్ రావు భౌతిక దేహానికి నివాళులర్పించారు. అనంతరం జోజోడు కుమార్‌కి అండగా ఉంటా.. అధైర్యపడొద్దని తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు రామాంజి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

Editor, Prblished and Owned by YENUMULA KULLAYAPPA, Published for D.No. 5-76, Bhanukota, Sri Satya Sai - 515621, Printed from Jai Sriram Publications D.No. 1-3-241, Rangaswamy nagar, Ananthapuramu 515001, EDITOR : YENUMULA KULLAYAPPA Mobile : 94940 39030.